# బస్సు సౌకర్యం కల్పించండి

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు, గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



రాజంపేట్, మార్చి 29 : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలులోకి తీసుకువచ్చింది. ఈ పథకం ద్వారా చాలా మంది మహిళలు లబ్ధి పొందుతున్నారు. కానీ రాజంపేట్ మండలంలోని కొన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో మహిళలకు ఉచిత ప్రయాణం అందడం లేదు. అన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యం ఉన్నా తమ గ్రామాలకు కూడా బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు అధికారులను వేడుకుంటున్నారు. రాజంపేట మండలంలో గతంలో బస్సు సర్వీసులు నడిచినా అర్ధాంతరంగా నిలిచిపోయాయి. కామారెడ్డి నుంచి రాజంపేట మీదుగా పెద్దాయి పల్లి గ్రామానికి ఉదయం, సాయంత్రం లోకల్ బస్సు వచ్చేది. కానీ ఆ సర్వీసును నిలిపివేశారు. దీంతో ఉన్నత చదువులకు రాజంపేట, కామారెడ్డికి వెళ్లేందుకు బస్సు సౌకర్యంలేక విద్యార్థులు రాజంపేట వరకు నడిచి వెళ్తున్నారు. విద్యార్థుల కోసం బస్సు సౌకర్యం కల్పించాలని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులను ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

# ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు



ఎల్లారెడ్డిలోని చర్చిలో బైబిల్ పఠనం చేస్తున్న క్రైస్తవులు



సంగమేశ్వర్ జీఎఫ్ఎం ప్రేయర్ హాల్‌లో ప్రార్థన చేస్తున్న భక్తులు

నిజాంసాగర్/ పిట్లం/ డోంగ్లీ/దోమకొండ/ఎల్లారెడ్డి రూరల్, మార్చి 29 : జిల్లావ్యాప్తంగా గుడ్‌ఫ్రైడేను శుక్రవారం క్రైస్తవులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు ఏసు బోధనలను వినిపించారు. బైబిల్ పఠనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. నిజాంసాగర్‌లోని బేరాక ప్రార్థన మందిరంలో ఏలిశా, మహ్మద్‌నగర్‌లో సంజీవ్ శ్యాంసన్, మాగి, అచ్చంపేట, కొమలంచ, మల్లూర్, వొడ్డేపల్లి, హెడ్‌స్లూస్ గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు, బైబిల్ పఠనం కొనసాగాయి. పిట్లంలోని సీఎస్ఐ చర్చిలో ఫాదర్ రెవరెండ్ జయరాజ్ గుడ్ ఫ్రైడే ప్రాధాన్యతను క్రైస్తవులకు వివరించారు. చర్చి కమిటీ సభ్యులు దేవదాస్, రాజ్ దీన్‌దయాల్, భారతమ్మ, రేఖ, సురేశ్ తదితరులు పాల్గొన్నారు. డోంగ్లీలో పాస్టర్ ప్రకాశ్ ఆధ్వర్యంలో గుడ్‌ఫ్రైడే వేడుకలను నిర్వహించారు. ఎల్లారెడ్డిలోని సెయింట్ ఆండ్రీవ్స్ చర్చిలో ఫాదర్ రెవరెండ్ ప్రభాకర్ గుడ్‌ఫ్రైడే పర్వదినం విశేషాలను వివరించారు. సాయంత్రం భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు ప్రభుకుమార్, స్వామిదాస్, మంత్రి సాల్మన్‌రాజు, మెర్సీమాలిని, వాసంతి తదితరులు పాల్గొన్నారు. దోమకొండతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లోని చర్చిల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంగమేశ్వర్‌లోని జీఎఫ్ఎం ప్రేయర్ హాల్‌లో రెవరెండ్ సాప శ్రీనివాస్ ప్రత్యేక సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో పవిత్ర, జ్ఞాన్ కుమార్, రాజ్‌కుమార్, మోహన్‌రెడ్డి, కమల, మరియమ్మ, రాజు రిబికా, రాజయ్య, పున్నమ్మ, జ్యోతి, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.



పిట్లం సీఎస్ఐ చర్చిలో వేడుకలు నిర్వహిస్తున్న క్రైస్తవులు

## మహిళ మెడలో నుంచి చైన్ స్నాచింగ్

వినాయక్‌నగర్, మార్చి 29 : జిల్లాకేంద్రంలోని శ్రీనగర్ కాలనీ పరిధిలో ఉన్న యెండల టవర్స్ వద్ద ఆటోలో కూర్చున్న మహిళ మెడలో నుంచి బైక్‌పై ఉన్న ఇద్దరు దుండగులు చైన్‌ను లాక్కెళ్లారు. మోపాల్ మండలం కులాస్‌పూర్ గ్రామానికి చెందిన లక్ష్మి పని నిమిత్తం సెవెన్ సీటర్ ఆటోలో శుక్రవారం జిల్లాకేంద్రానికి వచ్చింది. నగరంలోని శ్రీనగర్ కాలనీ చౌరస్తా వద్ద ఆటోలో ఉన్న మరో ప్రయాణికురాలిని దింపేందుకు ఆటో నిలుపగా.. అక్కడే బైక్‌పై ఉన్న ఇద్దరు దుండగులు ఆటో రిక్షాలో వెనకాల కూర్చొని ఉన్న లక్ష్మి మెడలో నుంచి రెండు తులాల బంగారు గొలుసును తెంచుకొని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఫోర్త్ టౌన్ ఎస్సై సంజీవ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాల్లో దుండగుల దృశ్యాలు రికార్డయినట్లు నగర సీఐ నరహరి వెల్లడించారు.

## పోగొట్టుకున్న ఫోన్ అందజేత

మాచారెడ్డి, మార్చి 29 : మండలంలోని లచ్చాపేట ఇటీవల గ్రామానికి చెందిన రవితేజ ఫోన్ పోగొట్టుకున్నాడు. వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేశారు. ఆ మొబైల్‌ను ట్రేస్ చేసి శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో బాధితుడికి అందజేశారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

## అంతిమయాత్ర వాహనం వితరణ

కామారెడ్డి, మార్చి 29 : జిల్లా కేంద్రంలోని గొల్లవాడ ఖబ్రస్తాన్‌కు కేపీ.రాజారెడ్డి జనసేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతిమయాత్ర వాహనాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డికి ముస్లింలు ధన్యవాదాలు తెలిపారు.

ఎకరానికి రూ.15 వేల

# నష్టపరిహారం ఇవ్వాలి



మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ కంది శివరాములు

రాజంపేట్, మార్చి 29 : ఇటీవల కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ఎకరానికి రూ.15 వేల నష్టపరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. రాజంపేట మండలం ఆర్గొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో సొసైటీ చైర్మన్ కంది శివరాములు అధ్యక్షతన శుక్రవారం మహాజన సభ సమావేశాన్ని నిర్వహించారు. ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీని చేయాలని రైతులు కోరారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ఎకరానికి రూ.15 వేల నష్ట పరిహారం చెల్లించాలని రైతులు తీర్మానం చేశారు. సమావేశంలో డైరెక్టర్లు, ఎంపీటీసీ సాగర్, సొసైటీ సీఈవో సాయిలు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పెద్దమల్లారెడ్డిలో

# పోలీసుల కవాతు

భిక్కనూరు, మార్చి 29 : మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో పోలీసులు శుక్రవారం కవాతు నిర్వహించారు. కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు, పోలీసులు గ్రామంలోని పలు కాలనీల్లో పర్యటించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల గురించి, ప్రజలకు భద్రత కల్పించేందుకు భరోసా కల్పించేందుకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ సంపత్ కుమా ర్, ఎస్సై సాయి కుమార్, జిల్లా పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పెద్దమల్లారెడ్డిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

సిండికేట్‌గా మారి..

# తక్కువ ధరకు బేరమాడి..

- రైతుల పాలిట శాపంగా మారిన రైస్‌మిల్లర్లు
- పస్కల పేరిట ధర తగ్గిస్తున్న యాజమాన్యాలు
- మద్దతు ధరకు కొనుగోలు చేయాలంటున్న రైతులు
- ప్రభుత్వం వరికి బోనస్ రూ.500 చెల్లించాలని అన్నదాతల డిమాండ్..



వర్ని శివారులో ధాన్యం కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

బాన్సువాడ, మార్చి 29 : రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు కొనుగోళ్ల విషయంలో రైస్ మిల్లర్లు ధరను తగ్గించి బేరసారాలు ఆడుతున్నారు. వరి పంట కోత దశకు వచ్చిన సమయంలో మొదటగా మిర్యాలగూడ, తమిళనాడు, బళ్లారి తదితర ప్రాంతాల నుంచి ధాన్యం కొనుగోళ్లు చేసేందుకు పదుల సంఖ్యలో వచ్చిన బ్రోకర్లు వడ్ల ధర తగ్గిందని తక్కువకు అడుగుతున్నారు. పంటను కోసే సమయంలో క్వింటాలుకు రూ.2,400 ధాన్యం కొనుగోలు చేసిన రైస్ మిల్లర్లకు ధాన్యం అందించే బ్రోకర్లు సైతం ప్రస్తుతం రూ.1,900, రూ.1,950, రూ.2,000 చివరిగా కొంటామని బేరమాడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదిలాఉండగా కొంత మంది రైతులు తమ పొలాన్ని కోసి రైస్ మిల్లర్లకు అమ్మబోతే ముందుగా ఒక ధర మాట్లాడి.. కొన్ని వడ్లకు పస్కలు ఉన్నాయంటూ కొర్రీలు పెడుతున్నారని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**వ్యాపారుల కుమ్మక్కు**

ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, బళ్లారి, మిర్యాలగూడ తదితర ప్రాంతాల్లో వరి పంటలు లేకపోవడంతో బేరగాళ్లు, బ్రోకర్లు, రైస్‌మిల్లర్లు ధాన్యం కోసం తెలంగాణ పల్లెలపై కన్నేశారు. వీరు సిండికేట్‌గా మారి ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని, లేదంటే మీ ఇష్టం అంటూ ధాన్యం కుప్ప నుంచి వెళ్లిపోతున్నారని రైతులు చెబుతున్నారు. ధాన్యాన్ని కొనుగోలు చేసే వ్యాపారులు, మధ్యవర్తులు కమిషన్‌తోపాటు క్వింటాలుకు రూ.200 నుంచి రూ.400 మిగిల్చుకొనేలా రైతుల వద్ద బేరం ఆడుతున్నారు. పంటలు చేతికొచ్చినా ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైస్‌మిల్లర్లకు ప్రభుత్వ మద్దతు ధరతో రైతుల నుంచి మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేయాలని, ప్రభుత్వం రైతులకు అందిస్తామన్న రూ.500 బోనస్‌ను కూడా చెల్లించాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో

## ఒకరి ఆత్మహత్య

నిజాంసాగర్, మార్చి 29: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ఆరేపల్లి గ్రామంలో గురువారం రాత్రి చోటుచేసుకున్నది. ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆరేపల్లికి చెందిన అనిల్(28) జక్కాపూర్ గ్రామానికి చెందిన స్వప్నను నాలుగేండ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ప్రస్తుతం రెండున్నరేండ్ల బాబు ఉన్నాడు. భార్యతో గొడవ జరగడంతో మనస్తాపం చెందిన అనిల్ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై తెలిపారు. ఘటనా స్థలాన్ని శుక్రవారం ఉదయం పరిశీలించి, వివరాలు సేకరించామని అన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా దవాఖానకు తరలించామని తెలిపారు. మృతుడి తండ్రి లచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

## నేడు పిట్లం -చిల్లర్గి విండో మహాజన సభ

పిట్లం, మార్చి 29: పిట్లం – చిల్లర్గి సహకారసంఘం మహాజన సభను రాంపూర్ గ్రామంలోని సహకార సంఘ కార్యాలయంలో నేడు(శనివారం) ఉదయం 10 గంటలకు సహకారసంఘం చైర్మన్ శపథంరెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు సీఈవో సంతోష్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి పాలకవర్గ బాధ్యులు, సహకార సంఘ సభ్యులు, రైతులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

## కాలభైరవుడిని దర్శించుకున్న బీబీ పాటిల్



స్వామిని పూజిస్తున్న ఎంపీ బీబీ పాటిల్

రామారెడ్డి, మార్చి 29: మండలంలో వెలిసిన కాలభైరవ స్వామిని జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు స్థానిక నాయకులు స్వాగతం పలికారు. అనంతరం ఇసన్నపల్లి గ్రామంలో సీతారామ, పార్వతీ రాజరాజేశ్వర ఆలయాలను దర్శించుకున్నారు. ఆయనవెంట పలువురు బీజేపీ స్థానిక నాయకులు ఉన్నారు.

# ఫీల్డ్ ట్రిప్‌నకు మోడల్ పాఠశాల విద్యార్థులు



'పీఎం శ్రీ' ట్రిప్‌నకు బయల్దేరి వెళ్తున్న మోడల్ పాఠశాల విద్యార్థులు

నిజాంసాగర్, మార్చి 29: మండలంలోని అచ్చంపేట మోడల్ పాఠశాల 6 నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులు 'పీఎం శ్రీ'లో భాగంగా శుక్రవారం ఫీల్డ్ ట్రిప్‌కు బయల్దేరి వెళ్లారు. సమతామూర్తి, శాంతివనం తదితర ప్రదేశాలకు తీసుకెళ్లినట్లు ప్రిన్సిపాల్ చంద్రకళ తెలిపారు. విద్యార్థి జీవితంలో ఇలాంటి పర్యటనలు ఎంతో ఉపయోగపడుతాయని అన్నారు. విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు విజయలక్ష్మి, సవిత, అనురాధ, ముత్యాలు తదితరులు తరలివెళ్లారు.

# సహకార సంఘం అభివృద్ధికి సహకరించాలి

గాంధారి సహకార సంఘం కార్యదర్శి మోహన్‌రెడ్డి

గాంధారి, మార్చి 29: సింగిల్ విండో అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని గాంధారి సహకార సంఘం కార్యదర్శి మోహన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇప్పటి వరకు విండో ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులతోపాటు నిర్వహించిన లావాదేవీలు, ఆదాయ,వ్యయాలను సభ్యులకు చదివి వివరించారు. పాలకవర్గ సభ్యులతోపాటు రైతుల సలహాలు, సూచనల మేరకు సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తామని కార్యదర్శి తెలిపారు. సమావేశంలో సొసైటీ వైస్ చైర్మన్ ఉద్దల్‌సింగ్, డైరెక్టర్లు గాండ్ల లక్ష్మణ్, దొల్లు సాయిలు, అశోక్‌రెడ్డి, నెహ్రూ, శివాజీ, గణపతి, పోచయ్య, జనార్దన్‌గౌడ్, అర్జయ్య, గాండ్ల సాయిలు, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విండో కార్యదర్శి మోహన్‌రెడ్డి

# బీఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ లేక ఇబ్బందులు




నిజాంసాగర్‌లోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం

నిజాంసాగర్, మార్చి 29: నిజాంసాగర్‌లో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, బీఎస్ఎన్ఎల్ టవర్ ఉన్నప్పటికీ నాలుగు రోజులుగా సేవలు అందడం లేదు. దీంతో బీఎస్ఎన్ఎల్ సిమ్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో బీఎస్ఎన్ఎల్ కార్యాలయానికి ప్రతి రోజూ ఉద్యోగులు హాజరై నాణ్యమైన సేవలు అందించేవారు. కొన్ని సంవత్సరాల క్రితం ఉద్యోగులకు సంస్థ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ అవకాశం ఇవ్వడంతో పలువురు విరమణ చేశారు. దీంతో అప్పటి నుంచి కార్యాలయం తాళాలు తీసే వారు కరువయ్యారు. అధికారులు ఎప్పుడు వస్తారో, ఎప్పుడో వెళ్తారో తెలియని పరిస్థితి నెలకొన్నది. నాలుగు రోజులుగా సిగ్నల్స్ సక్రమంగా అందక వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న విషయం ఉన్నతాధికారులకు తెలిసింది. దీంతో రెండు రోజులుగా టెక్నిషియన్లు సంబంధిత పనులు కొనసాగిస్తున్నట్లు చెబుతున్నా శుక్రవారం వరకు సిగ్నల్స్ రాలేదు. ఇంకా ఇబ్బందులు తొలగిపోలేదని వినియోగదారులు వాపోతున్నారు. సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరుతున్నారు.

కళ కోల్పోయిన

# బృహత్ ప్రకృతి వనం

**నిర్వహణపై సర్కారు నిర్లక్ష్యం**



*ఇదేదో చిట్టడివి.. బాగానే ఉంది కదూ.. అనుకుంటున్నారా.. అయితే మీరు పొరపాటు పడ్డట్లే.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన బృహత్ ప్రకృతి వనం ఇది. మండలంలోని మాచాపూర్ గ్రామంలో దీనిని ఏర్పాటుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకృతి వనాల నిర్వహణను గాలికి వదిలేయడంతో పరిస్థితి ఇలా తయారైంది.*

*ఎల్లారెడ్డి రూరల్, మార్చి 29*



మాచాపూర్‌లోని బృహత్ ప్రకృతి వనం

ఎల్లారెడ్డి మండలంలోని నాలుగు గ్రామాల్లో బృహత్ ప్రకృతి వనాలను ఏర్పాటుచేసి గ్రామాల్లో ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించేందుకు అప్పటి కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలను చేపట్టింది. ఉపాధి హామీ పథకంలో భాగంగా ఏప్రిల్ – 2021లో వీటిని ఏర్పాటుచేశారు. కొద్ది కాలంలోనే మొక్కలు ఏపుగా పెరిగి హరిత శోభను సంతరించుకున్నాయి. గ్రామస్తులకు స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను అందించాయి. రెండేండ్ల పాటు నిధులు సమకూరడంతో వీటి నిర్వహణ సక్రమంగా సాగింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో వీటి నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రకృతి వనాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం





వెల్లుట్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ సిబ్బంది, తాండూర్‌కిచ్చన్నపేట గ్రామంలో..

ఎల్లారెడ్డి/ ఎల్లారెడ్డి రూరల్, మార్చి 29: ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని తాండూర్ కిచ్చన్నపేట్ సొసైటీ సీఈవో జైపాల్‌రెడ్డి అన్నారు. నాగిరెడ్డిపేట మండలంలోని తాండూర్ కిచ్చన్నపేట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం 'ఏ' గ్రేడ్ ధాన్యానికి రూ.2,203, 'బీ' గ్రేడ్ ధాన్యానికి రూ.2,183 క్వింటాలుకు చెల్లిస్తుందని తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సొసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. ఎల్లారెడ్డి మండలంలోని వెంకటాపూర్, లక్ష్మాపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎల్లారెడ్డి, వెల్లుట్ల సొసైటీల సీఈవోలు విశ్వనాథం, రాంచందర్ ప్రారంభించారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని, దళారులకు అమ్మి మోసపోవొద్దని వారు రైతులకు సూచించారు. కార్యక్రమాల్లో ఆయా సొసైటీల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మండల కార్యవర్గం ఎన్నిక

ఎల్లారెడ్డి, మార్చి 29: కాంగ్రెస్ పార్టీ నాగిరెడ్డిపేట మండల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా శ్రీధర్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా సుధాకర్, లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా కిష్టయ్య, సహాయ కార్యదర్శులుగా వెంకట్‌రాంరెడ్డి, మురళీగౌడ్, కోశాధికారిగా లక్ష్మాగౌడ్ ఎన్నికయ్యారు. దీంతో పాటు క్రమశిక్షణ, కో–ఆర్డినేషన్, అడ్వయిజరీ కమిటీలు, సోషల్ మీడియా ఇన్‌చార్జిలను నియమించారు.

# 'చందనాగ్ని' కవితా సంపుటి ఆవిష్కరణ

సుభాష్‌నగర్, మార్చి 29 : కవి, వ్యాఖ్యాత వీపీ చందన్‌రావు రచించిన చందనాగ్ని కవిత సంపుటి ఆవిష్కరణ కార్యక్రమాన్ని నగరంలోని హరిచరణ్ మార్వాడీ కళాశాలలో హరిదా రచయితల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. సంపాదకుడు బైస దేవదాస్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చందన్‌రావు కవిత్వం సమాజానికి దారి చూపుతుందని, ఆయన శైలి సహజత్వంతోపాటు చమత్కారంతో పాఠకులను ఆకట్టుకుంటుందని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాళేశ్వరం శంకరం, హరిదా రచయితల సంఘం అధ్యక్షుడు ఘనపురం దేవేందర్, విద్యాశాఖ సంయుక్త కార్యదర్శి సరోజినిదేవి, పంచారెడ్డి లక్ష్మణ్, కందాళై రాఘవాచారి, తెరసం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్, తిరుమల శ్రీనివాస్, గంట్యాల ప్రసాద్, కాసర్ల నరేశ్‌రావు, మద్దుకూరి సాయిబాబు, గణపతి అశోకశర్మ, తల్లవఝుల మహేశ్ బాబు, ఆయాచితం నాగరాజు, బైస వీణ, మేక రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డిలో వ్యాపారి ఇంటిపై పోలీసుల దాడి

**చెక్కులు, ప్రామిసరీ నోట్‌లు స్వాధీనం**

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 29: పట్టణానికి చెందిన వ్యాపారి జాడె సూర్యప్రకాశ్ ఇంటితోపాటు దుకాణంపై ఎల్లారెడ్డి ఎస్సై బొజ్జ మహేశ్ ఆధ్వర్యంలో పోలీసు బృందం శుక్రవారం దాడులు చేసింది. గత నెలలో ఎల్లారెడ్డి పట్టణంలోని వడ్డీ వ్యాపారస్థులపై పోలీసులు దాడిచేసిన విషయం తెలిసిందే. దానిలో భాగంగా శుక్రవారం స్థానిక వ్యాపారి జాడె సూర్యప్రకాశ్ ఇంల్లు, దుకాణంలో సోదాలు చేశారు. కాగా కొన్ని చెక్కులు, ప్రామిసరీ నోట్‌లు లభించినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. అతడి వద్ద లభించిన చెక్కులు, ప్రామిసరీ నోట్‌లను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు. దాడిలో ఆయనతోపాటు ఏఎస్సైలు, పోలీసు సిబ్బంది ఉన్నారు.